క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి రాగిజావ తాగుతున్న ఎంఈఓ కృష్ణయ్య

దొరవారిసత్రం: ఆర్మీమేనికండ్రిగలోని ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈఓ కృష్ణయ్య తనిఖీ చేశారు. జగనన్న గోరు ముద్దను పరిశీలించారు. మెను ప్రకారం రాగి జావ ఎలా విద్యార్థులకు అందిస్తున్నారని ఆరా తీశారు. పిల్లలతో కలిసి తాగి రుచి చూశారు. పలు రికార్డులు తనిఖీ చేశా రు. ఆయన వెంట హెచ్ఎం స్వప్న ఉన్నారు.

వివాదాస్పద గ్రామాల్లో పోలీసుల పర్యటన



తాళ్వాయిపాడులో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ జగన్‌మోహన్‌రావు

పెళ్లకూరు: నాయుడుపేట రూరల్ సీఐ జగన్‌మోహన్‌రావు గురువారం మండలంలోని తాళ్వాయిపాడు, పెన్నేపల్లె తదితర వివాదాస్పద గ్రామాల్లో పర్యటించారు. గత ఎన్నికల సమయంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు ఇబ్బందులు తలెత్తే చర్యలకు పాల్పడిన వారిని నేరుగా కలిసి, హెచ్చరికలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని, వివాదాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. రాజకీయపార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలకు లోబడి ప్రవర్తించాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ శ్రీకాంత్ ఉన్నారు.

ముత్యాలమ్మ ఆలయానికి రూ 5.80 లక్షల ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరులో ఉన్న ముత్యాలమ్మ జాతర సందర్భంగా తాత్కాలిక దుకాణాల హక్కుల వేలం పాటల ద్వారా ఆలయానికి రూ 5.80 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓపీఆర్డీ మాణిక్యం తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి 5వ తేదీ వరకు జరగనున్న జాతర సందర్భంగా తాత్కాలిక దుకాణాల ఏర్పాటు హక్కులకు స్థానిక సచివాలయంలో గురువారం ఈఓపీఆర్డీ మాణిక్యం ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేలం పాటల్లో స్థానికులతోపాటు నెల్లూరు నగరానికి చెందిన వారు పాల్గొనగా వేలం పాటల హక్కును ఈదులవారిపాళేనికి చెందిన నల్లం కృష్ణ రూ 5.80 లక్షలకు దక్కించుకున్నారని చెప్పారు. ఈ వేలం పాటల్లో పంచాయతీ కార్యదర్శులు అల్లీబాషా, దిలీప్‌కుమార్, అశోక్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏ మల్లికార్జున్, ఒ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



నిందితుడి అరెస్టు చూపుతున్న రైల్వే పోలీసులు

గూడూరురూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, ఒకరిపై కేసు నమోదు చేసినట్లు గూడూరు రైల్వే ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మద్యం అక్రమ రవాణాపై రైల్వే పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారు జామున గూడూరు రైల్వేస్టేషన్‌లోని ఒకటో ప్లాట్‌ఫారంపై దక్షిణం వైపు అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద కర్ణాటక మద్యం సిల్వర్ కప్ బ్రాంది 39 బాటిళ్లతోపాటు మరో 4 ఫుల్ బాటిళ్లు ఉండగా గుర్తించి, సీజ్ చేశారు. నిందితుడు నెల్లూరు చిల్డ్రన్స్‌పార్కు ప్రాంతానికి చెందిన పెద్దిరెడ్డి కృష్ణ గా గుర్తించి, అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ

కోట: మండలంలోని కేసవరం, కొత్తపాళెం, ఉత్తమనెల్లూరు గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి గురువారం సామాజిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ పూర్ణిమ మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి సంబంధించి మండలంలోని 21 పంచాయతీల్లో చేపట్టిన పనులపై నలుగురు సభ్యులు సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. మార్చి 5వ తేదీ వరకు ఆ బృందం సభ్యులు గ్రామాల్లో చేపట్టిన పనులు, కొలతలపై విచారణ జరిపి వివరాలు నమోదు చేస్తారన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కల పెంపకంపై కూడా తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి



మాట్లాడుతున్న సమన్వయకర్త ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరురూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా కృషి చేద్దామని ఆ పార్టీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. గూడూరు మండలంలోని చెన్నూరు, తిప్పవరప్పాడు, కందలి, కొమ్మనేటూరు, నెర్నూరు, కుందకూరు గ్రామాల్లో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించి, నాయకులు, కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మేరిగ మురళీధర్‌ను గజమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం మేరిగ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన రూరల్ పరిధిలోని గోగినేనిపురం వద్ద ఉన్న ముత్తుమ్మారి అమ్మన్ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఎన్నికల సన్నాహక సభ నిర్వహిస్తున్నామని, అందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. గతంలో కంటే ఈ సారి జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి, అందరం సమన్వయంతో పనిచేసి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీ గురవయ్య, పార్టీ మండల కన్వీనర్ ఎం విజయకుమార్‌రెడ్డి, నాయకులు సీ విజయమోహన్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సునీల్‌రెడ్డి, రాజారెడ్డి, ఈ జనార్దన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బాబురెడ్డి, ఎం రాధాకృష్ణారెడ్డి, డీ కృష్ణారెడ్డి, కందలి సర్పంచ్ బీ వెంకటేశ్వర్లు, గోపాల్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమికి సర్వం సిద్ధం



లక్ష్మీనరసింహస్వామివారి వాహనాలు శుద్ధి చేస్తున్న సిబ్బంది

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శుక్రవారం రథసప్తమి వేడుకలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రథసప్తమి రోజున సప్తవాహనాల్లో పెనుశిల లక్ష్మీనసింహ స్వామి మాఢవీధుల్లో ఊరేగుతారు. రథసప్తమిని పర్వదినాన్ని మిని బ్రహ్మోత్సవాల్లా భావిస్తారని అధికారుల వెల్లడించారు. అందుకు సంబంధించిన శ్రీవారి వాహనాలను బయటకు తీసుకువచ్చి శుభ్రం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు సూర్యప్రభవాహనం, 8 గంటలకు శేషవాహనం, 10 గంటలకు సింహ వాహనం, 12 గంటలకు బంగారు హనుమంత వాహనం, 2 గంటలకు చక్రస్నానం, సాయంత్రం 4 గంటలకు హనుమంతవాహనం, 6కు అశ్వవాహనం, 8 గంటలకు చంద్రప్రభవాహనంపై స్వామివారు ఊరేగుతారని చెప్పారు.

జనార్దన్‌రెడ్డి విగ్రహ నిర్మాణ పనుల పరిశీలన



విగ్రహ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి విగ్రహ నిర్మాణ పనులను గురువారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహ నిర్మాణ ఇంజినీర్లతో పలు విషయాలపై చర్చించారు. విగ్రహ నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. అనంతరం విగ్రహావిష్కరణ జరిగే ప్రాంతంలో నిర్వహించే సభా వేదిక ప్రాంతాన్ని పరిశీలించారు.

నేడు రథసప్తమి

సైదాపురం: మండలంలోని కృష్ణారెడ్డిపల్లె వైకుంఠపురంలో ఉన్న మహాలక్ష్మీ సమేత మహావిష్ణువు ఆలయంలో శుక్రవారం రథ సప్తమి వేడుకలు నిర్వహించనున్నారు. స్వామివారికి విశేషాలంకరణ, అభిషేకాలు, పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

వలంటీర్లకు వందనం నేడు

నాయుడుపేటటౌన్: పట్టణంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం పట్టణంలోని కేకే కల్యాణ్ సదన్‌లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో వలంటీర్లకు పురస్కారాలు అందించి, సత్కరించనున్నట్లు వారు వెల్లడించారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు,నాయకులు హాజరు కావాలని కోరారు.

ఓజిలిలో..

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం వలంటీర్లుకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పీ హరినాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరతారన్నారు.

మహిళ వద్ద నగదు చోరీ

కోట: రోడ్డుపై నడిచి వెళుతున్న మహిళ చేతిలోని బ్యాగులో ఉన్న నగదు లాక్కుని నిందితుడు పరారైన ఘటన గురువారం విద్యానగర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగబాబు కథనం మేరకు.. వాకాడు మండలం గంగన్నపాళేనికి చెందిన నాగరాజమ్మ విద్యానగర్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఈఎంఐ చెల్లించేందుకు వెళుతుండగా మోటార్‌బైక్‌లో వచ్చిన ఓ వ్యక్తి ఆమె చేతిలోని బ్యాగ్‌ను లాక్కుని పరారయ్యాడు. బ్యాగ్‌లో రూ.15 వేలు నగదు ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాభిప్రాయం మేరకే అనుమతులు



మాట్లాడుతున్న డీఆర్వో పెంచలకిషోర్

గూడూరురూరల్: ప్రజాభిప్రాయం మేరకే మైనింగ్‌కు పర్యావరణ అనుమతులు ఇచ్చామని జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్ అన్నారు. గూడూరు మండలంలోని చెన్నూరు సమీపంలో ఉన్న శ్రీనివాస మైనింగ్ కంపెనీ వద్ద గురువారం డీఆర్వో పెంచల కిషోర్ అధ్యక్షతన పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో పెంచలకిషోర్ మాట్లాడుతూ చెన్నూరు గ్రామం సర్వే నంబర్ 1891లో ఓపెన్ కాస్ట్ పద్ధతిలో 38.518 హెక్టార్ల విస్తీర్ణంలో క్వార్జ్, మైకా, ఫెల్డ్‌స్పార్ ఖనిజాలకు సంబంధించి మైనింగ్ నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి తిరుపతి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించామన్నారు. మైనింగ్‌కు అనుమతి ఇవ్వాలని పలువురు అభిప్రాయాలను తెలుపగా ఈ ప్రాంతంలో మైనింగ్‌కు అనుమతులు ఇవ్వవద్దని మరికొందరు పేర్కొన్నారు. అందరి అభిప్రాయాలను ఆడియో, వీడియో రికార్డింగ్ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ప్రజాభిప్రాయం మేరకు మైనింగ్‌కు అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నరేంద్ర బాబు, గూడూరు తహసీల్దార్ కరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేశాకే అనుమతులు ఇవ్వాలి

చెన్నూరు సమీపంలోని శ్రీనివాస మైనింగ్‌లో 9 మంది భాగస్వాములతో కలసి 2013లో మైనింగ్ లీజు పొందినట్లు తుమ్మతాటి విజయభాస్కర్ అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం గురువారం గూడూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2020 వరకు మైనింగ్‌కు అనుమతి ఉందని, ఆ తరువాత తన సంతకాలు లేకుండానే అగ్రవర్ణాలకు చెందిన వారు కొత్త భాగస్వామితో డీడ్‌ను ఏర్పాటు చేసుకుని, మైనింగ్ నిర్వహిస్తున్నారన్నారు. తాను తవ్వి తీసిన సుమారు 70 వేల టన్నుల మెటీరియల్ డంపింగ్ ఉందని, తనకు తెలియకుండానే పర్మిట్లు తెచ్చుకుని తరలించి సొమ్ము చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పలు గ్రామాల్లో మాజీమంత్రి రాజ్యలక్ష్మి పర్యటన



దక్కిలిలో రాజ్యలక్ష్మికి స్వాగతం పలుకుతున్న నాయకులు

దక్కిలి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి రాజ్యలక్ష్మి గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. దక్కిలికి విచ్చేసిన ఆమెకు వైఎస్సార్‌సీపీ నేతలు సాదరంగా స్వాగతం పలికారు. తొలుత ఆమె కమ్మపల్లె గ్రామానికి వెళ్లారు. ఆ గ్రామంలో నేదురుమల్లి ముఖ్య అనుచరుడు సంక్రాంతి వెంకటసుబ్బానాయుడు గతేడాది అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని రాజలక్ష్మి పరామర్శించారు. అనంతరం వెంబులూరులో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పీ ఈశ్వరయ్య ఇంటికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. దేవులపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పాపిరెడ్డి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఎం నారాయణరెడ్డి, డీ రవీంద్రారెడ్డిని పరామర్శించారు. మార్లగుంట, దక్కిలిలో నూ పలువురిని పరామర్శించారు. ఆర్టీసీ రీజినల్ మాజీ చైర్మన్ సీహెచ్ శంకర్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జీ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంపీపీ వీ చెంచయ్య, వేణు నాయుడు, కే వేణుగోపాల్, ఎం నారాయణరెడ్డి, బీ రమేష్‌రెడ్డి, సీహెచ్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం



చిల్లకూరు: బల్లవోలులో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్న రెవెన్యూ అధికారులు

సైదాపురం: జగనన్న కాలనీల్లో ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మండలంలో వేగంగా కొనసాగుతోందని తహసీల్దార్ టీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఊటుకూరు, అనంతమడుగు, సైదాపురం సచివాలయాల్లో లబ్ధిదారుల వేలిముద్రలు నమోదు చేసి, ఇళ్ల స్థలాలను వారి పేరిట రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్థలం ఇచ్చి రిజిస్ట్రేషన్ ద్వారా సర్వహక్కులు కల్పిస్తుందన్నారు.

బల్లవోలులో..

చిల్లకూరు: బల్లవోలు సచివాలయంలో గురువారం వీఆర్వో శ్యామ్ లబ్ధిదారుల వివరాలు తీసుకుని వెంటనే వారికి రిజిస్ట్రేషన్‌లు చేసి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వర్లు అప్పుడప్పుడు మొరాయిస్తున్నాయని, దీంతో రిజిస్ట్రేషన్లు ఆలస్యం అవుతున్నాయన్నారు. అయినప్పటికీ రిజిస్ట్రేషన్లు శరవేగంగా చేస్తున్నామని తెలిపారు. ఒక్క రోజులోనే 12 మందికి రిజిస్ట్రేషన్లు చేయించామన్నారు.

9వ బెటాలియన్‌ను సందర్శించిన డీఐజీ



డీఐజీ-4 రాజకుమారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న 9వ బెటాలియన్ కమాండెంట్ ప్రకాష్

వెంకటగిరిరూరల్: మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌ను ఏపీఎస్పీ బెటాలియన్స్ డీఐజీ-4 బి రాజకుమారి గురువారం సందర్శించారు. బెటాలియన్ వార్షిక తనిఖీల్లో భాగంగా 9వ బెటాలియన్‌కు విచ్చేసిన డీఐజీ-4 రాజకుమారి, కమాండెంట్ పి ప్రకాష్ ఆధ్వర్యంలో పోలీసుల గౌరవ వందనంతో పుష్పగుచ్ఛాలు అందజేసి, ఘన స్వాగతం పలికారు. అనంతరం బెటాలియన్‌లోని ఆయుధశాల, స్టోర్స్, వైద్యశాలతో పాటు పలు ప్రదేశాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ పి ప్రకాష్, అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోస్, అసిస్టెంట్ కమాండెంట్స్ మనోహర్, ఆనంద్‌కన్నా, రామకృష్ణ, ఏఓ చంద్రమౌళి, వైద్యులు శేషమ్మ, చంద్రమౌళి, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 10.973 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 10.973 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 280 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హైలెవల్ కాలువకు 60, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

నాయుడుపేటటౌన్: అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా గురువారం కే గోపి బాధ్యతలు స్వీకరించారు. చిట్టమూరు ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై నాయుడుపేటకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రఘునాథ్ శ్రీహరికోటకు బదిలీ అయ్యారు. పట్టణంలోని పనిచేస్తున్న ఎస్ఐ కృష్ణయ్య ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఎస్ఐ గోపీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాంతి, భద్రల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

ఆటోను బస్సు ఢీకొని ఒకరి మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

దొరవారిసత్రం: మండలంలోని మావిళ్లపాడు సమీపంలో ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం వెలుగు చూసింది. స్థానిక పోలీసుల కథనం మేరకు.. తనియాలి గ్రామ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు(46) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సూళ్లూరుపేట నుంచి స్వగ్రామమైన తనియాలికి మరో వ్యక్తి వీరస్వామితో కలిసి బయల్దేరారు. మావిళ్లపాడు వద్ద వెనుక నుంచి చెన్నై-హైదరాబాద్‌కు వెళ్లే ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలోనే వెంకటేశ్వర్లు ఇరుక్కుపోయి మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన వీరస్వామి తీవ్రంగా గాయడగా చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని గురువారం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బస్సును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేలపట్టులో వైద్యశిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

సాక్షి ఎఫెక్ట్..

దొరవారిసత్రం: మండలంలోని నేలపట్టు ఎస్సీ కాలనీలో రెండు రోజుల నుంచి డీవీ సత్రం పీహెచ్ సీ వైద్య సిబ్బంది వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జ్వర పీడితులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. మూడు రోజుల కిందట సాక్షిదినపత్రికలో 'నేలపట్టును పీడిస్తున్న జ్వరాలు' అనే శీర్షిక కథనం ప్రచురితం కావడంతో స్థానిక వైద్యాధికారి చైతన్య స్పందించి నేలపట్టు ఎస్సీ కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. గురువారం కూడా ఈ శిబిరం కొనసాగింది. కాలనీలో జ్వరాలు అదుపులోకి వచ్చేంతవరకు శిబిరం కొనసాగించనున్నట్లు వైద్యాధికారి తెలిపారు. శిబిరంలో పీహెచ్ఎన్ పద్మావతి, హెచ్‌వీ మైథిలీ, వైద్య సిబ్బంది తస్నీమ్, రమణమ్మ, విజయ్‌కుమార్, వెంకటయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న డీఈఈ నందకుమార్



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ సాయిలహరి

కోట: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నందకుమార్ అధికారులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీటి సమస్య తలెత్తే ప్రాంతాలను గుర్తించాలన్నారు. మండలంలో ఉన్న 90 రక్షిత మంచినీటి పథకాల నిర్వహణపై వివరాలు సేకరించాలన్నారు. అలాగే పైలెట్ ప్రాజెక్ట్ ద్వారా నీటి సరఫరా జరుగుతున్న గ్రామాల్లో నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. పాడై పోయిన బోర్లు మరమ్మతులు చేయించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ హేమంత్ పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రానియొద్దు

చిల్లకూరు(చిట్టమూరు): వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎంపీడీఓ సాయిలహరి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో భూగర్భజలాల అడుగంటిపోవడంతో పలు చోట్ల తాగునీటిలో బురద వస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తెలుగుగంగ జలాలు విడుదలకు ఆదేశాలు జారీ చేసిందని, ఈ నేపథ్యంలో మండలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరలో జరిగే ఎన్నికలకు ప్రతి ఒక్కరు సిద్దంగా ఉండాలని తెలిపారు. డీఈఈ భరత్‌కుమార్, ఏఈ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణరోడ్లు.. బంగారు బాటలు

- నాలుగు రోడ్ల అభివృద్ధికి రూ.30 కోట్ల నిధులు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న మండల వాసులు



చాగణం రహదారి



ఆదూరుపల్లె రోడ్డు

సైదాపురం: మండలంలోని గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా రూ.30 కోట్లు కేటాయించింది. కొన్ని రోడ్లు పూర్తై, వినియోగంలోకి వచ్చాయి. మరికొన్ని రోడ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చాగణం ఎన్‌పీఎస్ రహదారికి రూ.5.95 కోట్లు, జీఆర్‌రోడ్డు నుంచి రాగనరామాపురం రోడ్డుకు రూ.1.24 కోట్లు, సైదాపురం-వేమలచేడు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పాలూరు వరకు రూ.89 లక్షలు, ఊటుకూరు నుంచి ఆదూరుపల్లె రోడ్డు రూ.1.35 కోట్ల ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకాల కింద ప్రభుత్వం నిధులను కేటాయించింది. దీంతో పంచాయతీరాజ్ అధికారులు ఈ రహదారుల అభివృద్ధి పనులు చేపట్టి, మూడు నెలల్లోనే నాలుగు రహదారులు పూర్తి చేశారు.

త్వరలోనే ప్రారంభోత్సవాలు



పనులు పూర్తి అయిన నాలుగు రహదారులను త్వరలోనే ప్రారంభిస్తాం. మూడు నెలల్లోనే రహదారుల పనులను పూర్తి చేయడం విశేషం. ప్రభుత్వం రూ.30 కోట్ల నిధులను మంజూరు చేసింది. గ్రామీణ ప్రజల కల సాకారమైంది.

-మవేక్‌రెడ్డి, స్పెషల్ ఏఈ, పంచాయతీ రాజ్


టీడీపీ ప్రభుత్వంలో పట్టించుకోలేదు



దారుణంగా మారిన రహదారుల ఆధునీకరణకు గురించి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణరోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, రహదారులు సుందరంగా తీర్చిదిద్దింది.

-గుంటమడుగు శ్రీనివాసులురాజు

అభివృద్ధిలో చరిత్ర



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధిలో చరిత్ర సృష్టిస్తోంది. ఈ క్రమంలోనే సైదాపురం మండలంలోని పలు రోడ్ల విస్తరణకు పుష్కలంగా నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో రోడ్లు పునర్నిర్మించడంతో నేడు ప్రయాణం సుఖవంతమైంది. ఇది హర్షించదగ్గ విషయం. - మన్నారపు రవికుమార్ యాదవ్